
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



తెరుచుకున్న చాపరాయి

గెడ్డ ప్రవాహ ఉధృతి తగ్గుముఖం పట్టడంతో పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారి ఎట్టకేలకు తెరుచుకుంది. 8లో



'మేహాద్రి' గేటు ఎత్తివేత

మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకుంది. దీంతో గేటును ఎత్తి వరద నీటిని విడుదల చేస్తున్నారు. 8లో



సమ్మోహనం

దేవరాపల్లి మండలంలోని రైవాడ జలాశయం పరిసరాల్లో ప్రకృతి అందాలు మనను పులకించేలా సమ్మోహన పరుస్తున్నాయి.

న్యూస్‌రీల్

జలపాతాల వద్ద పోలీసు బందోబస్తు

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: అనంతగిరి మండలం సరియా జలపాతంలో ఇద్దరు పర్యాటకులు గల్లంతు బాధాకరమని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పోలీసు యంత్రాంగంతో బందోబస్తు చేపడతామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతగిరి.అరకులోయ, జి.మాడుగుల, చింతపల్లి, పాడేరు, జీకేవీధి, పెదబయలు, డుంబ్రిగుడ, రంపచోడవరం,చింతూరు డివిజన్‌ల పరిధిలోని అన్ని జలపాతాల వద్ద పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెచ్చరిక బోర్డులను పరిశీలించిన తరువాతనే జలపాతాల్లో స్నానాలకు దిగాలని ఆయన సూచించారు. ప్రస్తుతం వర్షాలతో జలపాతాల వద్ద ప్రవాహం అధికంగా ఉండడంతో పర్యాటకులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులు జలపాతాల వద్ద పోలీసు సిబ్బందిని విధుల్లో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు.

గుంటవాడకు వరద తాకిడి

- ఒక గేటు ద్వారా 2,800 క్యూసెక్కులు విడుదల


గుంటవాడ జలాశయం

సీలేరు: విద్యుత్ కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు గుంటవాడ జలాశయానికి వరద తాకిడి కొనసాగుతోంది. బలిమెల జలాశయం నుంచి నిన్నటివరకు 20 వేల క్యూసెక్కులు విడుదల చేయగా శనివారం నుంచి 14,760 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బలిమెల పూర్తి స్థాయి నీటిమట్టం 1516 అడుగులు కాగా ప్రస్తుతం 1512 అడుగులు ఉంది. గుంటవాడ జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 1360 అడుగులు కాగా ప్రస్తుతం 1357 అడుగులు ఉంది. ప్రస్తుతం ఒక గేటు ద్వారా 2,800 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక్కడ విద్యుత్ ఉత్పాదనకు 8వేల క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.

86 సోలార్ విద్యుత్ యూనిట్లు మంజూరు


మొల్లిమెట్లలో ఏర్పాటుచేసిన సోలార్ ప్యానల్

రాజవొమ్మంగి: మండలంలో 86 పీవీటీజీ (ఆదివాసీ) కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ యూనిట్లు మంజూరు చేసినట్టు స్థానిక ట్రాన్స్‌కో ఏఈ సురేష్‌కుమార్ తెలిపారు. వీటిలో కొన్నింటిని ఇప్పటికే అమర్చినట్టు చెప్పారు. విద్యుత్ లైన్లు, గ్రామాలకు దూరంగా ఉన్న ఆదివాసీ కుటుంబాలకు ప్రభుత్వం జన్‌మన్ పథకంలో ఈ అవకాశం కల్పించినట్టు ఆయన తెలిపారు. ఒక్కో యూనిట్ ధర రూ. 2 లక్షలు కాగా దీని ద్వారా 300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. సోలార్ ప్యానల్, యూపీఎస్, ఫ్యాను, ఐదు బల్బులు, స్విచ్ బోర్డులు, సెల్‌ఫోన్లు, రిచార్జ్ చేసుకునే సాకెట్లు సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. బాహ్యప్రపంచానికి దూరంగా కొండలపై జీవించే ఆదివాసీ కుటుంబాలకు ఈ పథకం ఎంతో మేలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

వైద్య విద్యను దూరం చేసే కుట్ర



మధ్య తరగతి, నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్య అందేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టింది. ఇందులో ఐదు కళాశాలలను ప్రారంభించింది. మరో ఐదింటి నిర్మాణాలు పూర్తి చేసింది. ఏడు కాలేజీలు నిర్మాణ దశలో ఉన్నాయి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటిని ప్రైవేటుపరం చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇది చాలా అన్యాయం. నా కుమార్తెకు నీట్‌లో 603వ ర్యాంక్ వచ్చింది. ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు రాకపోవడంతో ప్రైవేట్ మెడికల్ కళాశాలలో చేర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాను.

– జ్ఞానేంద్రరెడ్డి, అక్కయ్యపాలెం, విశాఖపట్నం



ప్రైవేటీకరణ సరికాదు



ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో కొత్తగా ఐదు వైద్య కళాశాలలు ప్రారంభించాల్సి ఉంది. తద్వారా ఒక్కో కళాశాలకు 150 సీట్లు వచ్చేవి. వైద్య కళాశాలలు నడపలేమంటూ కేంద్రానికి లేఖ రాయడం చూస్తుంటే.. విద్యార్థుల భవిష్యత్ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో ఇట్టే తెలుస్తోంది. మెడికల్ కాలేజీల నిర్మాణ పనులు నిలుపుదల చేయడం సరికాదు. ముఖ్యంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దారుణం. విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు ఆడొద్దు..

– ఆర్.చందు, గాంధీనగర్, మాధవధార, విశాఖపట్నం

ఆదమరిస్తే.. పాతాళంలోకే..

పచ్చని ప్రకృతి ఒడిలో పాలనురగలతో పరవళ్లు తొక్కే జలపాతాలు పర్యాటకుల పాలిట మృత్యుకుహరాలుగా మారుతున్నాయి. ప్రకృతి అందాలకు నెలవైన మన్యంలో కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వీటి అందాలను తిలకించేందుకు వస్తున్న వారు అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. సెల్ఫీలు తీసుకుంటూ జారిపడి కొందరు.. స్నానాలకు దిగి మరికొందరు జలపాతాల్లో మునిగి గల్లంతవుతున్నారు. వర్షాలకు జలపాతాల వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొనడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఉధృతి తగ్గుముఖం పట్టిన తరువాత సందర్శనకు అనుమతిస్తున్నారు.

- మృత్యుకుహరాలుగా జలపాతాలు
- అజాగ్రత్త వల్లే ప్రమాదాలు
- ప్రవాహంలో కొట్టుకుపోతున్న ప్రాణాలు


డుడుమ జలపాతం వద్ద ప్రమాదాలు జరిగే ఎగువ ప్రాంతం

ముంచంగిపుట్టు: ఇటీవల కురిసిన వర్షాలకు డుడుమ జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. సుమారు 2,800 అడుగుల ఎత్తులోంచి జాలువారుతోంది. ఇక్కడి అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. జలపాతం పరిసర ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. జలపాతాన్ని దగ్గర నుంచి తిలకించేందుకు డుడుమకు నీరు వచ్చే ఎగువ ప్రాంతానికి వెళ్తున్నారు. బండరాళ్లకు నాచుపట్టి ఉన్నందున ప్రమాదాలకు గురై ప్రాణాలకు కోల్పోతున్నారు. వ్యూపాయింట్ నుంచి జలపాతం వద్దకు దిగేందుకు ఏర్పాటుచేసిన సుమారు 800 మెట్లు నాచుపట్టి ఉన్నందున జారిపడి జలపాతంలో పడిపోతున్నారు. గతంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ మహిళ మెట్ల మార్గం గుండా వెళ్తూ జలపాతంలోకి జారిపడి ప్రాణాలు కోల్పోయింది. ఊబిలో చిక్కుకుపోవడంతో వారం రోజుల తరువాత ఆమె మృతదేహం బయటపడింది. అజాగ్రత్తగా వ్యవహరించినప్పుడల్లా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి.

రక్షణ వాల్ ఏర్పాటుచేసినా..

డుడుమ వ్యూపాయింట్ వద్ద ప్రమాదాల నివారణలో భాగంగా ఒడిశా ప్రభుత్వం బండరాళ్లపై రక్షణ వాల్ ఏర్పాటుచేసింది. దానిని ఆనుకుని సందర్శకులు ఫొటోలు తీసుకుంటున్నారు. ఏమాత్రం అజాగ్రతగా వ్యవహరించినా లోయలో పడి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంది.

పొల్లూరుకు కట్టడి

మోతుగూడెం: పొల్లూరు జలపాతం వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున జలపాతం వద్దకు పర్యాటకులను అటవీశాఖ అధికారులు అనుమతించడం లేదు. అక్కడకు వెళ్లకుండా సిబ్బంది కాపలా ఉంటున్నారు. గతంలో సుమారు 20 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఉధృతి తగ్గడంతో తెరచుకున్న ద్వారం

కొత్తపల్లి జలపాతం: కొండవాగు నుంచి వచ్చే నీరు సుమారు 60 అడుగుల ఎత్తునుంచి బండరాళ్ల మీదుగా జాలువారుతుండటం వల్ల ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. బండరాళ్లకు నాచు పట్టి ఉన్నందున ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఈ నెల 11 వరకు మూసి ఉంది. ప్రవాహ ఉధృతి తగ్గుముఖం పట్టడంతో ఇప్పుడిప్పుడే సందర్శకులు వస్తున్నారు.

లోతు అంచనా లేక..

రంపచోడవరం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పాములేరు, సోకులేరు వాగులు, జలతరంగణి, అమృతధార జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పాములేరు వాగు లోతు తెలియకపోవడంతో ఇక్కడ సాన్నాలకు దిగిన సందర్శకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సుమారు 20 మంది వరకు ఈ ప్రాంతంలో ప్రాణాలు కోల్పోయారు. మారేడుమిల్లి- చింతూరు రోడ్డును ఆనుకుని ఉన్నందున ఈ మార్గంలో వెళ్లేవారు దిగేందుకు ఉత్సాహం చూపుతుంటారు. చూసేందుకు లోతు తక్కువగా ఉన్నట్టు కనిపించినా కొట్టుకుపోయిన వారు బండరాళ్లను గుద్దుకుని మృత్యువాత పడుతున్నారు.



డుడుమ జలపాతం వద్ద గాలింపు (ఫైల్)


బండరాళ్లపై నుంచి ఉధృతంగా కొత్తపల్లి జలపాతం


డుడుమ వ్యూపాయింట్ వద్ద సందర్శకులు ఫొటోలు

ఊబిని పూడ్చినా.. మళ్లీ ప్రమాదం

- సరియా జలపాతంలో ఇద్దరు గల్లంతు
- ఒకరు శ్రీకాకుళం, మరొకరు విశాఖ జిల్లా వాసి
- గాలించినా లభ్యం కాని ఆచూకీ
- తల్లడిల్లుతున్న కుటుంబసభ్యులు


సరియా జలపాతం వద్ద ప్రమాదం జరిగిన ప్రాంతం

అనంతగిరి (అరకులోయ రూరల్): సరియా జలపాతం వద్ద సుమారు రెండేళ్ల తరువాత మళ్లీ ప్రమాదం చోటుచేసుకుంది. ఇక్కడ ఊబిలు ఉన్నందున తరచూ ప్రమాదాలు జరిగేవి. ఇప్పటివరకు సుమారు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే వీటిని నివారించేందుకు స్థానిక పోలీసులు చొరవ చూపారు. ప్రమాదాలు జరిగే ప్రాంతంలో ఎస్‌ఐ కరక రాము ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం బ్లాస్టింగ్ చేసి బండరాళ్లను తొలగించి ఊబిని పూడ్చారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి ప్రమాదాలు జరగలేదని స్థానికులు చెబుతున్నారు.

భారీగా తరలివచ్చిన సందర్శకులు

శనివారం సెలవుదినం కావడంతో పరిసర జిల్లాల నుంచి భారీగా సుమారు 1500 మంది వరకు సందర్శకులు తరలివచ్చారు. అందరిమాదిరిగానే శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరానికి చెందిన లంక సాయికుమార్ (30), విశాఖకు చెందిన నేవీ ఉద్యోగి దిలీప్‌కుమార్ (30) స్నేహితులు, కుటుంబాలతో జలపాతం వద్దకు వచ్చారు. వీరిలో సాయికుమార్ స్నానం చేస్తుండగా బండరాయి పైనుంచి జారిపోయి జలపాతంలో పడిపోయాడు. మునిగిపోతున్న అతనిని రక్షించేందుకు అక్కడే ఉన్న నేవీ ఉద్యోగి దిలీప్‌కుమార్ ప్రయత్నించారు. ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ఇద్దరు కొట్టుకుపోయి గల్లంతయ్యారు. వీరికోసం గాలింపు చేపట్టినా వారి ఆచూకీ లభ్యం కాలేదని ఎస్‌ఐ కరక రాము తెలిపారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక చర్యలు


చింతపల్లిలోని గర్భిణుల వసతిగృహంలో పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా


ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులు, వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

చింతపల్లి: కాలానుగుణంగా సంభవించే సీజన్ వ్యాధుల కట్టడికి వైద్యారోగ్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు డీఎంహెచ్‌వో జమాల్‌బాషా అన్నారు. శనివారం ఆయన మండలంలోని లంబసింగి, లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను తనిఖీ చేశారు. ఇటీవల డయేరియా విజృంభించిన చింతలూరు గ్రామాన్ని ఆయన సందర్శించారు. వ్యాధి నుంచి కోలుకున్న వారిని పరామర్శించారు. అనంతరం చింతపల్లి ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. చింతపల్లిలోని గర్భిణుల వసతిగృహాన్ని పరిశీలించారు. మంచి పోషకాహారం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలినా తొందరపడి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రులో వైద్యం పొందాలని సూచించారు. అన్ని రకాల వైద్యపరీక్షలు చేసి మందులు ఇస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో చింతపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి, వైద్యాధికారులు దినేష్, ఆరోగ్య విస్తరణాధికారి సింహాద్రి, ఎల్. మురళి పాల్గొన్నారు.

చాక్లెట్ వినాయకుడు.. పాలతో నిమజ్జనం


పాలతో నిమజ్జనం చేస్తున్న భక్తులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఏర్పాటు చేసిన 30 కిలోల చాక్లెట్ వినాయకుడి నిమజ్జన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహదాత కొమ్ము సాయికుమార్, కుటుంబ సభ్యులు 40 లీటర్ల పాలతో చాక్లెట్ వినాయకుడిని కరిగించారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు సమీప గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి ఆసక్తిగా తిలకించారు. కరిగించిన చాక్లెట్‌ను భక్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా విగ్రహదాత సాయికుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా చాక్లెట్ వినాయకుడిని అల్లూరి యూత్ సహకారంతో ఏర్పాటు చేశామని తెలిపారు.

సమగ్రంగా పంట నష్టం సర్వే


సర్పంచ్‌తో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్


నిమ్మచెట్టు గ్రామంలో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

- పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్
- ధారకొండ పంచాయతీలో పర్యటన

సీలేరు: తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో పంట నష్టం సర్వే నిర్వహిస్తామని పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ వెల్లడించారు. తుపానుకు దెబ్బతిన్న ధారకొండ పంచాయతీలోని గంగవరం అగ్రహారం, మాదిమల్లు గ్రామాల్లోని వంతెనలను శనివారం ఆయన పరిశీలించారు. నిమ్మచెట్టు గ్రామంలో జరిగిన నష్టాన్ని ధారకొండ సర్పంచ్ రాజు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా చాలా గ్రామాలు దెబ్బతిన్నాయన్నారు. రోడ్లు,వంతెనలు పూర్తిగా కొట్టుకుపోయాయని, వ్యవసాయానికి తీవ్ర నష్టం జరిగిందని ఆయన వివరించారు. జరిగిన నష్టంపై సమగ్రంగా సర్వే నిర్వహించి గిరిజనులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్‌ను ఆయన కోరారు. ఈమేరకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పొలాల్లోకి కొట్టుకువచ్చిన బండరాళ్లు, మట్టిమేటలను తొలగిస్తామని ఆయన తెలిపారు.

అంతర్‌రాష్ట్ర రహదారి ధ్వంసం.. అపార నష్టం

- తుపానుకు దెబ్బతిన్న జీకేవీధి- సీలేరు ప్రధాన రహదారి
- కొండచరియలు విరిగి పడటంతో శిథిలమైన బ్రిడ్జిలు, కల్వర్టులు
- తాత్కాలిక మరమ్మతుల్లో నిమగ్నమైన అధికార యంత్రాంగం

సాక్షి,పాడేరు: ఇటీవల తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు అంతర్రాష్ట్ర రహదారిలో గూడెంకొత్తవీధి- సీలేరు మధ్య ప్రాంతం ధ్వంసమైంది. కొండవాగుల నీరంతా రోడ్డుపై పొంగి ప్రవహించింది. దీంతో బ్రిడ్జిలు, కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయి.

- కొండచరియలకు రోడ్డు ధ్వంసమైంది. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు జరుగుతున్నాయి. ద్విచక్రవాహనాలు, కార్లు, వ్యాన్లు, ఆటోలు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు వెళ్లేందుకు మార్గం లేదు. గూడెంకొత్తవీధి నుంచి లంకపాకలు, ధారాలమ్మ, ధారకొండ ఘాట్ మీదుగా సీలేరు సమీపంలోని జొన్నగెడ్డ వరకు ఐదు బ్రిడ్జిలు, ఆరు కల్వర్టులు దెబ్బతిన్నట్టు ఆర్అండ్‌బీ అధికారవర్గాలు తెలిపాయి. సుమారు 30 కిలోమీటర్ల వరకు ఆర్అండ్‌బీ రోడ్డుకు నష్టం వాటిల్లింది.
- శాశ్వత పనులకు గాను రూ.74 కోట్లు అవసరమని ఆర్టీసీ అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు.
- లంకపాకలు ప్రాంతంలో మూడు వంతెనలు, పాలగెడ్డ, వలసగెడ్డ వంతెనలు ఐదింటికి రూ.70లక్షలు, ఆరు కల్వర్టులకు రూ.60లక్షలు, 30కిలోమీటర్ల రోడ్డు రూ.1.50 కోట్లతో తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. ప్రస్తుతం వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా ఉండేలా అధికారులు తాత్కాలిక మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. గూడెంకొత్తవీధి నుంచి జొన్నలగడ్డ వరకు పూర్తిస్థాయిలో వంతెనలు, కల్వర్టులు,రోడ్డు నిర్మాణాలకు రూ.74కోటతో ఆరఅండ్‌బీ ప్రతిపాదనలు పంపింది.

మరమ్మతులు వేగవంతం



గూడెంకొత్తవీధి-సీలేరు రోడ్డులో రవాణా అనువుగా ఉండేలా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నాం. ఈ ఘాట్‌లో వంతెనలు, కల్వర్టులు,రోడ్డు ధ్వంసం కావడంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. యంత్రాలతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, పాడేరు


కొండచరియలు తొలగించిన రహదారి


చురుగ్గా కొండచరియల మట్టి తొలగింపు పనులు


వాహనాలు వెళ్లేలా మెరుగుపడిన రహదారి

భూకబ్జాదారులపై చర్యలు శూన్యం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ధ్వజం


అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయించిన ఎమ్మెల్యే మత్స్యలింగం, పశుసంవర్ధక శాఖ సిబ్బంది

అరకులోయ రూరల్: భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ధ్వజమెత్తారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న పశు సంవర్ధకశాఖకు చెందిన స్థలాన్ని టీడీపీకి చెందిన సర్పంచ్, కొంతమంది ప్రజాప్రతినిధులు షాపింగ్ కాంప్లెక్సు నిర్మించుకుంటున్నారు. దీంతో వారం రోజుల క్రితం ఆదివాసీ జేఏసీ నేతలు, రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ అధికారులు నిర్మాణ పనులను నిలిపివేయించారు. పనులు చేపట్టకూడదని గతంలో కలెక్టర్, ఐటీడీఏ పీవోలు ఆదేశాలిచ్చినప్పటికీ వాటిని పట్టించుకోకుండా శనివారం నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యేకు సమాచారం ఇచ్చారు. దీంతో పశుసంవర్ధకశాఖ అధికారులు, జేఏసీ నాయకులతో ఎమ్మెల్యే మత్స్యలింగం అక్కడికి వెళ్లి పనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు పనులు నిలిపివేసిన తరువాత పట్టించుకోవడం లేదని, వాటిని తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ స్థలంలో షాపింగ్ కాంప్లెక్సు నిర్మిస్తుంటే వారంతా నిద్రపోతున్నారన్నారు. తక్షణం కట్టడాలను తొలగించి స్థలాన్ని పశుసంవర్ధకశాఖ అధికారులకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుండా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

క్లుప్తంగా

'అల్లూరి'లో బాధిత కుటుంబాలకు సాయం



సరకులు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పరవాడ జెడ్పీటీసీ రాజు

పరవాడ: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నిరాశ్రయులైన బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, జెడ్పీటీసీల బృందం శనివారం చట్రాపల్లి గ్రామాన్ని సందర్శించింది. బాధిత పునరావాస కేంద్రం సప్పర్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న వారిని పరామర్శించారు. వారికి తమ వంతు సాయంగా బియ్యం, కూరగాయలు, చీరలు, దుప్పట్లను పంపిణీ చేశామని పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు తెలిపారు.

'35' సినిమా బృందం సందడి



మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొన్న 35 సినిమా బృందం

పీఎంపాలెం: స్థానిక సాంకేతిక టెక్నికల్ క్యాంపస్‌లో '35 చిన్న కథ కాదు' సినిమా బృందం శనివారం నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం సందడిగా సాగింది. '35' సినిమాను విజయవంతం చేయడంపై చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత సిద్ధార్థ మాట్లాడుతూ మంచి చిత్రాలు తీస్తే విజయవంతం చేస్తారని ప్రేక్షకులు మరోసారి నిరూపించారని, భవిష్యత్‌లో మరిన్ని మంచి చిత్రాలను అందిస్తామన్నారు. సినిమా హీరోయిన్ నివేతా థామస్, హీరో విశ్వదేవ్ రాచకొండ, దర్శకుడు నందకిశోర్ ఏమని తదితరులు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతిక క్యాంపస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రాహుల్ ఆళ్వార్‌దాస్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధు భట్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల అనుభవంతో 350పైగా చిత్రాల్లో నటించా

- జబర్దస్త్ అప్పారావు



కె.కోటపాడు : రంగస్థల కళాకారుడిగా గడించిన అనుభవంతోనే 24 ఏళ్ల కాలంగా 350కు పైగా చిత్రాల్లోను, 70కు పైగా సీరియల్స్‌లోను నటించినట్లు జబర్దస్త్ అప్పారావు అన్నారు. శనివారం కె.కోటపాడులో ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 1984 నుంచి రంగస్థలం కళాకారుడిగాను, బుర్రకథ, జానపద గీతాలను పాడుతుండేవాడినని తెలిపారు. తనకు నాటక రంగానికి మాదేటి వెంకట లక్ష్మణరావు, సినిమా రంగానికి లంక సత్యానందం గురువులని పేర్కొన్నారు. ఇన్నాళ్ల పాటు కళాకారునికి కళారంగానికి సేవ చేస్తూ ప్రేక్షకుల అభిమానం పొందినట్లు తెలిపారు. శుభవేళ చిత్రం తనకు మొదటి సినిమా అని అన్నారు. సరిలేరు నీకెవ్వరూ, చందమామ, మహాత్మ, మిణుగురులు తదితర చిత్రాలు తనకు మంచి పేరును తీసుకువచ్చినట్లు తెలిపారు.

త్రిశక్తి స్వరూపిణి 'పరమేశ్వరి'





సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనం.. శ్రద్ధగా ఆలకిస్తున్న భక్తజనం

- ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ

అనకాపల్లి: పరమేశ్వరి త్రిశక్తి స్వరూపిణి అని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. అమ్మవారిని ఆరాధిస్తే సకల ఐశ్వర్యాలు ప్రసాదిస్తుందని తెలిపారు. మెయిన్‌రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్ట శతజయంతి వేడుకల్లో భాగంగా పరమేశ్వరి వైభవంపై ఆయన అనుగ్రహ భాషణం చేశారు. పార్వతీ పరమేశ్వరులు ఈ విశ్వానికి తల్లిదండ్రులని పేర్కొన్నారు. బిడ్డలు తప్పు చేస్తే అమ్మ మాత్రమే క్షమిస్తుందని, స్త్రీలను దేవతలుగా పూజించే సంస్కారం భారతదేశంలో ఉందని అన్నారు. ప్రకృతి స్వరూపమైన అమ్మవారిని ప్రతి ఒక్కరూ ఆరాధించాలని తెలిపారు. లలితా సహస్రనామం పఠిస్తే అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహిస్తారన్నారు. అమ్మవారు దుర్గాదేవిగా శక్తిని, లక్ష్మీదేవిగా ఐశ్వర్యాన్ని, సరస్వతీదేవిగా జ్ఞానాన్ని ప్రసాదిస్తారని తెలియజేశారు. ఈ ముగ్గురమ్మలు కలిసి పరమేశ్వరి దేవిగా శక్తి స్వరూపిణియై లోకాన్ని కాపాడతారని, భక్తులను అనుగ్రహిస్తారని తెలియజేశారు. భగవంతుడిని మనం పట్టించుకోకపోయినా, భగవంతుడు మనల్ని పట్టించుకుంటారని వివరించారు. అమ్మవారిని పూజించి, అనుగ్రహం పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ శతజయంతి ఉత్సవాల కమిటీ కో-చైర్మన్ గ్రంథి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సామవేదం షణ్ముఖశర్మ ముందుగా కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు శతజయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు పూర్ణకుంభంతో స్వాగతించారు. ఆది, సోమవారాల్లోనూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పరమేశ్వరి అమ్మవారి ప్రవచనాలు ఉంటాయని బుచ్చిరాజు తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం

నాటుపడవపై వైర్లు తరలింపు



నాటు పడవలో విద్యుత్ కండక్టర్లు

సీలేరు: తుపాను గిరిజన గ్రామాల్లో విధ్వంసం సృష్టించడంతో ఎక్కడికక్కడ రోడ్లు ,వంతెనలు కొట్టుకుపోయాయి. మారుమూల గ్రామాలు ఇప్పటికీ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. చాలా గ్రామాలకు విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో ఐదు రోజులుగా సరఫరా నిలిచిపోయింది. సమాచార వ్యవస్థ పనిచేయడం లేదు. దుప్పులవాడ పంచాయతీ పిల్లిగెడ్డ వాగును ఆనుకుని ఉన్న మారుమూల గ్రామాల్లో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. కొమ్మురాపల్లి, జొన్నమామిడి, పిల్లిగెడ్డ, కాట్రగడ్డ, సంతనేరేడుపల్లి తదితర గ్రామాలు ఇప్పటికీ అంధకారంలో ఉన్నాయి. పిల్లిగెడ్డపై వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో విద్యుత్ వైర్లు, మెటీరియల్‌ను గ్రామాలకు తరలించే అవకాశం లేకపోవడంతో నాటుపడవలపై తీసుకువెళ్లేందుకు గ్రామస్తులు ముందుకువచ్చారు. విద్యుత్ సిబ్బంది గ్రామాలకు వెళ్లి విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేశారు. వీటికి సంబంధించిన వైర్లు, ఇతర సామగ్రిని ఆయా గ్రామాల ప్రజలు నాటుపడవపై తీసుకువెళ్లారు.

అదుపుతప్పి వ్యాన్ బోల్తా

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ బాలరేవుల సమీపంలో తాగునీటి పైపులను తీసుకెళ్తున్న ఓ వాహనం శనివారం బోల్తా పడింది. గ్రామ సమీపంలోని రహదారి చాలా ఎత్తుగా ఉండడంతో వాహనం మలుపులో అదుపు తప్పింది. దీంతో బోల్తా పడింది.

ప్రమాదంలో వాహనంలో ఉన్న పైపులన్నీ కిందపడగా, డ్రైవర్ క్షేమంగానే ఉన్నట్టు స్థానికులు చెప్పారు. నర్సీపట్నం నుంచి వాటిని నవనిర్మాణ్ సంస్థ తీసుకెళ్తున్నట్టు తెలిసింది.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న వర్మ, సురేష్‌కుమార్

భీమునిపట్నం: భీమిలి సమీపం కీతిన్‌పేట వద్ద ఉన్న సన్‌స్కూల్‌లో శనివారం రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పోటీలను రాష్ట్ర యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సీఎంఆర్‌కే వర్మ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి 600 మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, ఇందులో ఆరేళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య బాల బాలికలు, స్త్రీ పురుషులు ఉన్నారని.. వీరికి 11 కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దివీస్ సంస్థ మేనేజర్ డి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ తరపున పోటీల నిర్వహణకు తగిన సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రామారావు, ఉపాధ్యక్షుడు చక్రవర్తి, రాబర్ట్ శ్రీను, శ్రీనివాస్, సన్‌స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజీయే రాచమార్గం

- జాతీయ లోక్ అదాలత్‌లో 4,477 కేసుల పరిష్కారం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



విశాఖ లీగల్: రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్ వద్ద శనివారం జాతీయ లోక్ అదాలత్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ జరిగితే.. వాటికి ఎటువంటి అపీలు లేదన్నారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. తొలుత రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తెల్హరి అమరావతి నుంచి వర్చువల్‌గా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి విశాఖలోని విశాఖపట్నం, భీమునిపట్నం, గాజువాక, చోడవరం, అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, అరకు, పాడేరు, చింతపల్లి, మాడుగుల న్యాయస్థానాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 4,477 కేసులు పరిష్కరించినట్లు ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

పాముకాటుతో యువకుడి మృతి



మృతుడు శివ

నక్కపల్లి: మండలంలో డొంకాడ గ్రామానికి చెందిన సఖిరెడ్డి శివ(31) పాముకాటుకు గురై మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పది గంటలకు శివ తన పొలంలో పనులు చేస్తుండగా గుర్తుతెలియని పాము ఎడమకాలుపై కాటేసింది. ఇది గమనించిన వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేయగా, వారు హుటాహుటిన తునిలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం సామర్లకోటలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



అల్లంపుట్టు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

- మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలి
- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం
- అల్లంపుట్టు పాఠశాలలో తనిఖీలు
- మెనూ అమలు కాకపోవడంతో ఆగ్రహం

హుకుంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. శనివారం అల్లంపుట్టు గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనాన్ని రుచిచూసిన అనంతరం నాణ్యతగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల నుంచి గుడ్లు పెట్టటం లేదని విద్యార్థులు చెప్పడంతో ఉపాధ్యాయులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందజేయకపోవడంతోనే విద్యార్థులు అనారోగ్యానికి గురువుతున్నారని చెప్పారు. ఇకపై పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు కాకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం తడిగిరి పంచాయతీ ఉక్కుర్బ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. హెచ్ఎం వేణుగోపాల్ తదితరులున్నారు.

అత్యుత్తమ వర్సిటీల్లో ఏయూకు స్థానం



మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: విద్యార్థులు సానుకూల దృక్పథం, ఆలోచనలతో ముందుకు సాగాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సూచించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శనివారం ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి వీసీ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. నాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఏయూ మెరుగైన స్థానం సాధించిందని, రానున్న కాలంలో దేశంలోని అత్యుత్తమ 10 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఏయూను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ నేవల్ ప్రాజెక్ట్స్(విశాఖ) చీఫ్ ఇంజినీర్ బ్రిగేడియర్ సురేష్ రామనాథన్ మాట్లాడుతూ సిక్కిం, కశ్మీర్ లాంటి ప్రాంతాల్లో గతంలో చేసిన నిర్మాణాలు, ప్రస్తుతం చోటు చేసుకుంటున్న మార్పులను వివరించారు. జీఐఎస్, రిమోట్ సెన్సింగ్ రంగాల్లో నిష్ణాతులుగా మారాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య కె.రాంబాబు మాట్లాడుతూ ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం బోధన, పరిశోధన, కన్సల్టెన్సీ రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని తెలిపారు. అత్యాధునిక సదుపాయాలతో ఆరు ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిభ చూపించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. బీఐఎస్ విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ డి.అఖిల్, విభాగ ఆచార్యులు కె.శ్రీనివాసరావు, సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి, సదస్సు కన్వీనర్ ఆచార్య ఐ.శివపార్వతి, స్టూడెంట్ కన్వీనర్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ డీఈవోకు విశిష్ట విద్యా సేవా పురస్కారం



కాకినాడలో విశిష్ట విద్యాసేవా పురస్కారం అందుకుంటున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

గంగవరం : ఏజెన్సీ డీఈవో, గంగవరం ఎంఈవో-1 వై.మల్లేశ్వరరావుకు చేయూత సంస్థ విశిష్ట విద్యా సేవా పురస్కారం అందజేసింది. కాకినాడ సూర్య కళామందిర్‌లో శనివారం జరిగిన చేయూత సేవా సంస్థ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా డీఈవో మల్లేశ్వరరావును సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో విశిష్ట విద్యా సేవా పురస్కారం అవార్డుతో ఘనంగా సన్మానించారు. విద్యాభివృద్ధికి మల్లేశ్వరరావు చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు అందజేసినట్టు రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మల్లేశ్వరరావు మాట్లాడుతూ అవార్డు అందుకోవడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. చేయూత సేవా సంస్థ వ్యవస్థాపకులు తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావుకు ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్ ఎంపీపీలు గంగాదేవి, రామతులసి, ఎంపిడిఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసరావు, యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి కృష్ణ, గౌరవాధ్యక్షులు రఘుబాబు అభినందించారు.

హాస్టల్‌లో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

సీతమ్మధార(విశాఖ): సీతమ్మధారలోని సాంఘిక సంక్షేమ శాఖ బాయ్స్ హాస్టల్-2లో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్ సంక్షేమ అధికారి ఆర్.ప్రసాద్‌రావును సస్పెండ్ చేయడంతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగి ఎం.అప్పారావును విధుల నుంచి తొలగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సీతమ్మధార సాంఘిక సంక్షేమ శాఖ బాయ్స్ హాస్టల్-2లోని మరుగుదొడ్లను శుభ్రపరిచేందుకు అక్కడ విద్యార్థులను వినియోగించినట్లు ఈ నెల 9న కలెక్టర్‌కు ఫిర్యాదు అందించింది. విచారణలో నిజ నిరూపణ అయినందున దీనికి కారణమైన ఆ ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ వివరించారు.

అక్టోబర్ 6న వైజాగ్ జూ మారథాన్

బీచ్‌రోడ్డు(విశాఖ): వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 6న వైజాగ్ జూ మారథాన్ 3వ ఎడిషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రేస్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణచైతన్య తెలిపారు. శనివారం మారథాన్ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఇందిరా గాంధీ జూ పార్కు నుంచి మారథాన్ ప్రారంభమవుతుందని, 21కే, 10కే, 5కే, 3కే పేరిట పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు, నగర ప్రజలంతా ముందుగా తమ పేర్లను www.vtra.run వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. విజేతలుకు రూ.3 లక్షల నగదు బహుమతి ఉంటుందని చెప్పారు.

'మేహాద్రి' గేటు ఎత్తివేత

- మూడో గేటు నుంచి 150 క్యూసెక్కుల విడుదల
- ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 59.6 అడుగులు

పెందుర్తి(విశాఖ): మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ గేటును అధికారులు శనివారం ఎత్తారు. రిజర్వాయర్ నీటి మట్టం ఉదయానికి 59.9/61 అడుగులకు చేరుకోవడంతో గేటును తెరిచేందుకు అధికారులు నిర్ణయించుకున్నారు. నీటిపారుదల శాఖ ఈఈ ఏ.త్రినాథం, ఏఈ పి.నళిని, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ ఆధ్వర్యంలో రిజర్వాయర్ మూడో గేటును మూడు అడుగుల మేర ఎత్తి 150 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రికి మేహాద్రి నీటిమట్టం 59.6 అడగులు ఉన్నట్లు నీటిపారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు తెలిపారు. ఇన్‌ఫ్లో అధికంగా ఉండడంతో ఆదివారం ఉదయం వరకు గేటును తెరిచే ఉంచుతామని వెల్లడించారు.

తెరుచుకున్న చాపరాయి

- గెడ్డ ఉధృతి తగ్గడంతో సందర్శనకు అనుమతి



చాపరాయి వద్ద పర్యాటక తాకిడి

డుంబ్రిగుడ: చాపరాయి జలవిహారి ఎట్టకేలకు తెరుచుకుంది. భారీ వర్షాలకు చాపరాయి గెడ్డ పొంగి ప్రవహించడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున గత శనివారం నుంచి సందర్శకులకు అనుమతించలేదు. ప్రస్తుతం తగ్గుముఖం పట్టడంతో శనివారం నుంచి సందర్శకులను అనుమతించేలా కలెక్టర్ దినేష్ కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాలిచ్చారు. వరుసగా మూడు రోజులు సెలవు కావడంతో పర్యాటకుల రాక మొదలైంది.